క్లుప్తంగా

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



విరాళాన్ని ఆలయ అధికారులకు ఇస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ గో సంరక్షణ ట్రస్ట్‌కు బెంగళూరుకు చెందిన లాస్యమేదశ కుటుంబ సభ్యులు ఆలయ అధికారులకు రూ.లక్ష విరాళంగా అందించారు. మంగళవారం వారు స్వా మివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అధికారులకు విరాళం ఇచ్చారు. ఆలయ అధికారులు దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి : డీఈఓ



రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. టీచర్ల అటెండెన్స్, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థుల సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. టీచర్లు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పీసీఆర్ పాఠశాల హెచ్‌ఎం పూర్వాణి, టీచర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఐరాల విద్యార్థిని



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినితో హెచ్‌ఎం, పీడీ

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని భవిత జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కోమల మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలో నిర్వహించిన అండర్–14 ఫెన్సింగ్ పోటీల్లో తమ విద్యార్థిని వ్యక్తిగత విభాగంలో విశేష ప్రతిభ కనబరచి సిల్వర్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి అండర్–14 పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటుందని వెల్లడించారు. భవితను, పీడీ దేవా, ఫెన్సింగ్ కోచ్ కార్తీక్‌ను పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ




నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, ఉపాధ్యాయులు

యాదమరి: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఎంపీడీఓ శివరాజ్, ఎంఈఓ రుక్మిణి మంగళవారం ఆవిష్కరించారు. మొదటగా ఉపాధ్యాయులు ఎంపీడీఓ, ఎంఈఓలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు గుణశేఖర్, ప్రధాన కార్యదర్శి రమేష్, గౌరవ అధ్యక్షుడు ఎంఎస్ బాషా, జిల్లా ఆర్థిక కార్యదర్శి మదన మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమే లక్ష్యం

తవణంపల్లె: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మంగళవారం మండలంలోని చెర్లోపల్లె ఎంపీపీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాన్ని మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు హరిరెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ప్రజలు జగననన్న సురక్ష వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు వినయ్‌కుమార్, అఖిల్, షర్మిద రోగులకు వైద్య పరీక్షలు మందులు పంపిణీ చేశారు. 178 మందిని కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం కోసం రెఫర్‌చేశారు. జార్జి, గుణశేఖర్ పర్యవేక్షించారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి కనీస వసతులపై నివేదిక సమర్పించాలని నగర కమిషనర్ జె.అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగర పాలక పరిధిలోని మొత్తం 150 పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించాలని,. విద్యుదీకరణ, నీటి సరఫరా, ఫర్నీచర్, మరుగుదొడ్లు, ర్యాంపు నిర్మాణంపై నివేదిక ఇవ్వాలన్నారు. ఇంకనూ వాటిల్లో ఏమైనా పనులు చేయాలా? అనేది తెలియజేయాలన్నారు. ఇందు కోసం అధికారులను బృందాలుగా ఏర్పాటు చేశారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

నగరపాలక పరిధిలో బుధవారం నుంచి నిర్వహించనున్న ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణపై కమిషనర్ అరుణ నగర పాలక అధికారులు, వైద్యాధికారులతో సమీక్షించారు. నిర్దేశించిన షెడ్యూల్ వారీగా క్యాంపులను పక్కాగా నిర్వహించాలని, అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని, కౌంటర్ల ఏర్పాటు నిర్వహణ పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వలంటీర్లు, ఆశా కార్యకర్తలు ఇంటింటా సర్వే పూర్తి చేసేలా పర్యవేక్షించాలన్నారు. క్యాంపు రోజున నిర్దేశించిన విభాగాల వైద్యులు హాజరయ్యేలా సమన్వయం చేయాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఏసీపీ రామకృష్ణుడు, సీఎంఎం గోపి, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



ఐరాల: పాడి ఆవులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది



తవణంపల్లె: గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్న గోపాలమిత్ర తులసికుమార్

గుడిపాల: పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు పాడి రైతులు వేయించుకోవాలని పశువైద్యాధికారి సాయిసుధ కోరారు. పశుమందలో మంగళవారం ఆమె పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేసి మాట్లాడారు. ఈ టీకాలు వేయకపోతే పశువులు వివిధ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో 17వేల వరకు పాడి ఆవులు, ఎద్దులు ఉన్నాయని, ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో టీకాలు వేస్తామన్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం

ఐరాల: పశుపోషకులు గాళ్ల వ్యాధి తో(గాలికుంటు వ్యాధి) అప్రమత్తంగా ఉండాలని మండల పశుసంవర్ధక శాఖ ఏడీ పద్మావతి సూచించారు. మండలంలోని కొత్తపల్లె, చిగరపల్లెలో మంగళవారం గాలికుంటు వ్యాధికి టీకాలు వేశారు. ఏడీ మాట్లాడుతూ రైతులు గాలికుంటు వ్యాధి నివారణకు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 31వ తేదీ వరకు ముందు జాగ్రత్త చర్యగా ఉచితంగా వేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాధి సోకిన పశువులను వైరస్ ప్రబలకుండా పశువుల మంద నుంచి దూరం చేయాలని చెప్పారు.

తవణంపల్లె మండలంలో..

తవణంపల్లె: పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు తవణంపల్లె పశు వైద్యాధికారి డాక్టర్ లావణ్య తెలిపారు. మంగళవారం మండలంలోని దిగువమోదలపల్లె 230 పశువులకు, మత్యంలో 55 పశువులకు, తెల్లగుండ్లపల్లెలో 50 పశువులకు సిబ్బంది సహకారంతో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు వివరించారు. రైతులు సహకరించి టీకాలు వేసుకోవాలని కోరారు.

ఓంశక్తి పూజలు



ఓంశక్తి పూజలు చేస్తున్న మహిళలు

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో మంగళవారం ఓంశక్తి 50మందికి పైగా మహిళలు మాల ధరించి ప్రత్యేకంగా అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం 200 మందికి పైగా అన్నదానం చేశారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



చీలాపల్లెలో అక్షింతలను అందజేస్తున్న రామభక్తులు

గుడిపాల: అయోధ్య రాముల అక్షింతలను గ్రామాల్లో ఆయా కుటుంబాలకు మంగళవారం అందజేశారు. మరకాలకుప్పం, నంగమంగళం, చీలాపల్లెలో రామ భక్తులు వీధుల్లో తిరిగి అన్ని కుటుంబాలకు అక్షింతలను అందజేశారు. ఈ అక్షింతలను పూజ రూముల్లో ఉంచి జనవరి 22వ తేదీన అయోధ్య రామమందరం ప్రారంభం సమయంలో తలపై చల్లుకోవాలని కోరారు.

క్రీడలతోనే మానసికోల్లాసం





ఆటల పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, తవణంపల్లెలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

తవణంపల్లె: క్రీడలతోనే మానసిక ఉల్లాసమని తవణంపల్లె మండల వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు హరిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కృష్ణాపురం తొడతర, తవణంపల్లె హైస్కూల్లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలను మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, వైఎస్ఆర్ సీపీ నాయకులు రమణారెడ్డి, మధుకుమార్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడుతాయని సూచించారు.

ఆటల్లో రాణించండి

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలలో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆటగాళ్లు రాణించాలని ఎంపీడీఓ గౌరి తెలిపారు. మంగళవారం మండలంలోని తేనేపల్లి, మద్దులయ్యగారిపల్లి, బైటపల్లి క్రీడాకారులకు క్రీడలను అధికారులు నిర్వహించారు. ప్రభుత్వం అందించిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర స్థాయిలో ఆడడానికి ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి, నాయకులు నిరంజన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఎంఈఓ–2 కోటీశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పూతలపట్టులో..

కర్ణాటక మద్యం స్వాధీనం



కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్ చూపుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: బంగారు పాళ్యం మండలం ముంగర మడుగు క్రాస్ వద్ద మంగళవారం ఎస్ఈబీ అధికారులు దాడులు చేశారు. మద్యం విక్రయిస్తున్న రమేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతని నుంచి 37 కర్ణాటక మద్యం బాటిళ్లతో పాటు మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ట్రైనీ ఏఈఎస్ శ్రీరాం, హెడ్ కానిస్టేబుల్ కష్టయ్య, సుబ్రమణ్యం గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

7న వన్నియ కుల క్షత్రియ సమావేశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్, వన్నియ కుల క్షత్రియ నాయకులు

శాంతిపురం: ఈ నెల 7న కనుమలదొడ్డిలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వన్నియ కుల క్షత్రియ కులస్తుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ కుల నాయకులు కోరారు. సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో విడుదల చేశారు. కార్యక్రమంలో కుప్పం, శాంతిపురం మండలాల పార్టీ కన్వీనర్లు మురుగేష్, బుల్లెట్ దండపాణి, నాయకులు పాల్గొన్నారు.

సిగరెట్ దెబ్బకు రూ.30వేల ఆస్తినష్టం!

చౌడేపల్లె: కాల్చి పడేసిన సిగరెట్ దెబ్బకు ఆస్తినష్టం సంభవించిన సంఘటన మండలంలోని ఏ.కొత్తకోట పంచాయతీ అంకుతోటపల్లెలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామస్తుడు వెంకటరమణకు చెందిన గడ్డివామి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడంతో మంటలు చెలరేగాయి. ఈ సంఘటనలో రూ.30 వేల విలుచేసే గడ్డి కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న పుంగనూరు ఫైర్ సిబ్బంది సుబ్రమణ్యం, సుమన్, ఇమ్మాన్యుయేల్ సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు.

హామీలన్నీ నెరవేర్చిన ప్రభుత్వం

సదుం: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బూరగమందలో మంగళవారం సాయంత్రం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన వారికి వివరించారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మకుండా వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వెంకటరెడ్డి, గణేష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, బాగిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



మందుల కిట్‌ను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఎంతో మందికి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చిందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాముగానిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజారోగ్యానికి పెద్దపీట వేసి అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన లభించిందని, ఇప్పుడు మరో పర్యాయం మరింత సమగ్ర వైద్యసేవలు అందివ్వడానికి ఈ కార్యక్రమాన్ని కొన్ని నెలల పాటు ప్రభుత్వం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. శిబిరంలో అన్ని రకాల వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శిబిరంలో వైద్య సదుపాయాలు, స్టాళ్లను ఆయన పరిశీలించారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్‌నాయక్, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, తహసీల్దార్ చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన విజయానందరెడ్డి



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని సైతం కలిశారు.

కొత్తగా 87 పింఛన్లు మంజూరు



గుడిపాల: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

గుడిపాల: ప్రభుత్వం సామాజిక పింఛన్ రూ.2750 నుంచి రూ.3వేల వరకు పెంచడమే కాకుండా మండలానికి కొత్తగా 87 పింఛన్లు మంజూరు చేసిందని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం వైఎస్ఆర్ పింఛన్ కానుక పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి నెరవేరుస్తున్నారని, వలంటీర్లతో ఇళ్ల ముంగిటకే పింఛన్లు అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీలు బాబు, గోపి, సర్పంచులు రజనీకాంత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఐరాల: ప్రభుత్వం నూతనంగా పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 2750 నుంచి రూ.3000కు పెంచిన మొత్తాన్ని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పంపిణీ చేస్తారన్నారు. సర్పంచులు, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ మెంబర్, అధికారులు హాజరు కావాలన్నారు.

పూతలపట్టు మండలంలో..

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేసే రూ.3000 పింఛన్ కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గౌరి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్తపింఛను, పాత పింఛనుదారులు హాజరు కావాలని సూచించారు. వారితో పాటు వలంటీర్లు, అధికారులు పాల్గొనాల్సిందిగా కోరారు.

పథకాలను వినియోగించుకోండి



పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

బంగారుపాళెం: పేద ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పూతలపట్టు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి భానుప్రకాష్ అన్నారు. టేకుమంద, నలగాంపల్లె గ్రామాల్లో మంగళవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కేంద్ర పథకాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సర్పంచ్ రత్నయ్య, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అమరనాథ్, మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్, ఏఓ చిట్టిబాబు, హౌసింగ్ ఏఈ గుణశేఖర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల తలరాతను మార్చిన సీఎం



వైద్యశిబిరంలో బీపీ పరీక్షించుకుంటున్న ఎంపీ రెడ్డెప్ప

- దింపుడు కళ్లెంపై టీడీపీ
- అభివృద్ధి నిరోధకులుగా మారిన బాబు, పవన్ కళ్యాణ్
- చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు విమర్శ

బైరెడ్డిపల్లె: పేదల జీవితాల్లో వెలుగులు నింపి, వారి తలరాతను మార్చాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె సచివాలయంలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2' కార్యక్రమాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగు కోసం సీఎం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు తన పాలనలో దోపిడీకి అధిక ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని దివాలా తీసేలా చేసి పేదల నోట్లో మట్టి కొట్టారని దుయ్యబట్టారు. దింపుడు కళ్లెం లాంటి టీడీపీని నమ్మే స్థితిలో జనం లేరన్నారు. అర్హులందరికీ కూడు, గూడు, విద్య, వైద్యం, తాగునీరు, కనీస వసతులు కల్పించి జగనన్న ఆదుకుంటుంటే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియా కోర్టుకు వెళ్లి అభివృద్ధికి అవరోధులుగా మారారని మండిపడ్డారు. మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించి రెండవసారి ముఖ్యమంత్రి చేసుకుంటే సంక్షేమాన్ని కొనసాగిస్తారని, మరింత అభివృద్ధి పథంలోకి రాష్ట్రాన్ని తీసుకెళ్తారన్నారు. వైద్యులు శిబిరంలో పేదలను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, సర్పంచ్ వెంకటేష్, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్ కుమార్, శాలిని, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.